సర్కారు బడుల్లోని విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలు



కె.శంకర్‌రాథోడ్, ఎంఈవో

అత్తాపూర్: వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు నెల రోజుల పాటు శిక్షణ తరగతులు ఉంటాయని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి కె.శంకర్‌రాథోడ్ ఫిజికల్ డైరెక్టర్ కేశవత్‌గంగానాయక్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులలో క్రీడా స్ఫూర్తి ఉన్న క్రీడాకారులను గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శివరాంపల్లిలో ఎంపిక జరిగిందన్నారు. 17 సంవత్సరాల లోపు బాలబాలికలు సమ్మర్ క్యాంప్‌లో పాల్గొనాలని సూచించారు. వివరాలకు ఫోన్: 94408 99993లో సంప్రదించాలన్నారు. రోజూ ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గటల వరకు క్రీడలు జరుగుతాయన్నారు.

అక్షయ తృతీయ రోజున దానం ఎంతో గొప్పది



మణికొండ: అక్షయ తృతీయ రోజు చేసే దానం ఎంతో గొప్పదని, దాని వలన ఎంతో పుణ్యం లభిస్తుందని అరుణాచల శివ సేవా సత్సంగ్ ప్రతినిధులు శ్రీహరి, కిరణ్, వంశీ అన్నారు. బుధవారం అక్షయ తృతీయను పురస్కరించుకుని సెక్రటేరియట్ కాలనీలోని గోల్డెన్ టెంపుల్‌లో శివాభిషేకం, గణపతి పూజ, లక్ష్మీకుబేర పూజ, గో పూజలను నిర్వహించారు. వంద మంది బ్రాహ్మణులు, 200 మందికిపైగా గోశాల కార్మికులకు రూ. 2 వేల విలువ చేసే పలు రకాల వస్తువుల కిట్‌లను అందజేశారు. మాజీ కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి, నేతలు బి.శ్రీరాములు, మాల్యాద్రినాయుడు పాల్గొన్నారు.

4 ప్రాంతాల్లో మజ్జిగ పంపిణీ

ఆర్యవైశ్య అఫిషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో మణికొండ మున్సిపాలిటీ పరిధిలో నాలుగు ప్రాంతాల్లో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్షయము అంటే శ్రేయస్సు, ఆశ, ఆనందం, విజయం, ఎప్పటికీ తరిగిపోనిదని, ఇలాంటి రోజు దానాలు చేయటం ఎంతో మేలు చేస్తుందని ఆవోపా జిల్లా అధ్యక్షుడు బి.శ్రీధర్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా సర్కారు బడులు

- ఫలితాల్లో సత్తాచాటిన 'ప్రభుత్వ పాఠశాలలు'
- ఆ పాఠశాలల్లో చదివేది పేద విద్యార్థులే
- కార్పొరేట్ స్కూళ్లకు సవాల్ విసిరిన సర్కారు బడులు



మణికొండ టాపర్‌లను అభినందిస్తున్న దృశ్యం

అత్తాపూర్: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించినట్లు రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్‌రాథోడ్, అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత అన్నారు. అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల తెలుగు మీడియం, ఇంగ్లిష్ మీడియంలో 72 శాతం బాలురు, 87 శాతం బాలికలు ఉత్తీర్ణులైయ్యారన్నారు. విద్యార్థినులు వసంత, గాయత్రీలు పాఠశాల ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారన్నారు.

మణికొండ పరిధిలో...

మణికొండ: పదవ తరగతి ఫలితాలలో సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యార్థినులు హర్షిత 600 మార్కులకు 570 మార్కులు, సంజనకు 566, ప్రదీప్తికి 564 మార్కులు, కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయం విద్యార్థిని హిమబిందుకు 556 మార్కులతో సత్తాచాటారు. ఉత్తమ మార్కులతో రాణించారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో నార్సింగి ఉన్నత పాఠశాల విద్యార్థి కృష్ణరాయ్‌కి 558 మార్కులతో మండల టాపర్‌గా నిలిచాడు. ఆ తరువాతి స్థానంలో మణికొండ ఉన్నత పాఠశాల విద్యార్థిని రేష్మకు 544 మార్కులు రావటంతో ద్వితీయ స్థానంలో నిలిచింది. వట్టినాగులపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి డేనియల్ 521 మార్కులతో మూడవ స్థానంలో నిలిచాడు. మణికొండ ఉన్నత పాఠశాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులను ఉపాధ్యాయులు, మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, నాయకులు స్వీట్లు తినిపించి అభినందించారు.

శంషాబాద్ పరిధిలో...

శంషాబాద్: మండలంలో ప్రభుత్వ పాఠశాలలో పది ఫలితాలు వందకు వంద శాతం సాధించడంలో కొంత వెనకబడినా ఆయా పాఠశాలల్లోని విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారు. పాలమాకుల మోడల్ స్కూల్ అత్యధికంగా 93 శాతం ఫలితాలు సాధించగా రామాంజపూర్ పాఠశాలలో 55 శాతం ఫలితాలు వచ్చాయి. పెద్ద షాపూర్ జెడ్పీ పాఠశాల విద్యార్థిని అత్యధికంగా కె.పూజ 574 మార్కులు సాధించింది. పాలమాకుల మోడల్ స్కూల్ విద్యార్థి ధనుష్ 552 మార్కులు సాధించాడు. శంషాబాద్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.శ్రీదేవి 512 మార్కులు సాధించగా శంషాబాద్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థి కె.ప్రమోద్ 544 మార్కులు సాధించాడు. చిన్నగోల్కొండ జెడ్పీ పాఠశాల విద్యార్థిని ఎం. కీర్తన 539 మార్కులు సాధించింది. జెడ్పీహెచ్ఎస్ తొండుపల్లి విద్యార్థిని కె. నిఖిత 523మార్కులు, జెడ్పీహెచ్ఎస్ నర్కూడ విద్యార్థి కె.సాయికిరణ్ 534 మార్కులు, కేజీబీవీ విద్యాలయ విద్యార్థిని ఆకాంక్ష 506 మార్కులు సాధించింది.

బీసీ వెల్ఫేర్ స్కూల్‌లో...

శంషాబాద్ రూరల్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండల పరిధిలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ విద్యార్థినులు సత్తా చాటారు. రాజేంద్రనగర్ పాఠశాల విద్యార్థిని జ్యోతిర్మయి 575 మార్కులు, మహేశ్వరం పాఠశాల విద్యార్థిని బి.సింధు 575 మార్కులు సాధించారు. పెద్దషాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.పూజ 574 మార్కులతో ఉత్తీర్ణత సాధించింది.



అత్తాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వసంత, గాయత్రి



జ్యోతిర్మయి (575)



బి.సింధు (575)

టెన్త్‌లో రంగారెడ్డి జిల్లా టాపర్‌గా కార్తీక్



పాపిశెట్టి కార్తీక్ (584/600)

మైలార్‌దేవ్‌పల్లి: చదువుకు పేదరికం అడ్డురాదని తమకు అవకాశాలు కల్పిస్తే నిరూపించి చూపుతామని పలువురు పేద విద్యార్థులు నిరూపించారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ గణేష్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన పాపిశెట్టి కార్తీక్ (584/600) మార్కులు సాధించి రంగారెడ్డి జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ... ఇంటర్‌లో ఎంపీసీ తీసుకొని ఏరోస్పేస్ ఇంజినీర్ అవుతానన్నారు. తన తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారని బాగా చదువుకొ వారికి అండగా నిలుస్తానన్నారు.

విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందన

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లిలోని మహవీర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పోటీల్లో మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను బుధవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అభినందించి సన్మానించారు. 3వ ఇంటర్ డిస్ట్రిక్ట్ సబ్ జూనియర్ ఉషు చాంపియన్ షిప్ 2025ను అమెచూర్ ఉషు అసోసియేషన్ సిరిసిల్ల డిస్ట్రిక్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు పద్మ నాయక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో మైలార్‌దేవ్‌పల్లిలోని మహవీర్ మార్షల్ ఆర్ట్స్ ఉషు అకాడమీ విద్యార్థులు పి.ప్రణవ్ డబుల్ షాట్ వెబ్‌లో సిల్వర్ మెడల్, శ్రీశాంత్ డబుల్ షాట్ వెబ్, నన్‌కాన్ టైప్‌లో రెండు బ్రాన్జ్ మెడల్స్ సాధించారు. రానున్న రోజుల్లో మరిన్ని పోటీల్లో పాల్గొని సత్తాచాటాలని ఈ సందర్భంగా విద్యార్థులను ఎమ్మెల్యే ప్రోత్సహించారు. కార్యక్రమంలో కోచ్ సంతోష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

ప్రజావసరాల మేరకే అభివృద్ధి

అత్తాపూర్: ప్రజావసరాల మేరకు అభివృద్ధి పనులను చేపడుతున్నామని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోంద్ర సంగీతగౌరీశంకర్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని హుడా కాలనీలో సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... రూ. 7 లక్షల వ్యయంతో నూతన సీసీ రోడ్డును వేస్తున్నామన్నారు. ఇప్పటికే అత్తాపూర్ డివిజన్‌లో పూర్తిస్థాయిలో సీసీ రోడ్ల నిర్మించి డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఇంకేమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి ఎం.కొమురయ్య, నేతలు సులిగే వెంకటేష్, వెంకట్‌రెడ్డి, ముఖేష్ బిరాధర్, శశికాంత్ శర్మ, విజయ్, స్వామి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మోంద్ర సంగీత

పార్టీ కోసం కష్టపడే వారికే పదవులు

బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేష్



మణికొండ: రాష్ట్రంలో అధికారమే ధ్యేయంగా పార్టీని తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందని, రాబోయే రోజుల్లో అలాంటి నాయకులను గుర్తించి పార్టీకి ఎక్కువ సమయం ఇచ్చే వారికే పదవులను అప్పగిస్తామని బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదరిశ గణేష్ అన్నారు. బుధవారం నార్సింగి మున్సిపాలిటీ కోకాపేటలో పార్టీ ముఖ్య నాయకులు, క్రియాశీలక సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పార్టీకి మరింత సమయం ఎక్కువగా పనిచేయాల్సి ఉంటుందని, అలాంటి వారు పదవులకు న్యాయం చేస్తామనుకునే వారు పార్టీ పదువులకు తమ పేర్లను ఇవ్వాలన్నారు. అలాంటి వారి పేర్లతో త్వరలోనే మున్సిపాలిటీ, నియోజకవర్గ, జిల్లా కమిటీలను ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నార్సింగి మున్సిపల్ అధ్యక్షుడు ఎం.నగేష్‌యాదవ్, ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు డి.లక్ష్మీనారాయణ, మున్సిపల్ మాజీ అధ్యక్షుడు సి.హెచ్.భిక్షపతియాదవ్, మాజీ కౌన్సిలర్ ఆర్. ఆదిత్యరెడ్డి, నాయకులు శివరాజ్, నర్సింగ్ రావు, శేఖర్ అప్ప, కిరణ్, బ్రహ్మచారి, సాయి కిరణ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

రాజేంద్రనగర్: ప్రభుత్వ స్థలంలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను రాజేంద్రనగర్ తహసీల్దార్ నేతృత్వంలో కూల్చివేశారు. మానస హిల్స్ ప్రాంతంలోని ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మాణాలను చేపడుతున్నారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు భారీ పోలీసు బందోబస్తు మధ్య బుధవారం ఉదయం కూల్చివేశారు. మరోసారి నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ హెచ్చరించారు.

ఘనంగా పరశురామ జయంతి



రాజేంద్రనగర్: భగవాన్ పరశురాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు బస్తీల్లో పెద్ద ఎత్తున పల్లకి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పరశురాం భక్త మండల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మహిళలు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శోభాయాత్ర అనంతరం రాంబాగ్ దేవాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో సుదర్శన్ ప్రసాద్ తివారీ, శశికాంత్ శర్మ, అశోక్ శర్మ, శోభా పాండే, నవనీత్ తివారీ తదితరులు పాల్గొన్నారు.

అడ్డాల్లో ఆకలి పోరు!

- పనుల కోసం పడిగాపులు
- రెక్కాడితేగానీ డొక్కాడని పేదలు
- ప్రధాన అడ్డాగా చింతల్‌మెట్ చౌరస్తా
- పాతికేళ్లుగా బతుకు పోరులో కూలీలు



చింతల్‌మెట్‌లో పనుల కోసం ఎదురు చూస్తున్న పేదలు

శాస్త్రిపురం: చింతల్‌మెట్ చౌరస్తా దినసరి కూలీలకు అడ్డాగా విరాజిల్లుతోంది. చిన్న పని మొదలుకొని పెద్ద పని వరకు ఏ పని చేయాలన్నా ఇక్కడ కూలీలు లభిస్తారు. పరిసర ప్రాంతాల్లో పనులు ప్రధానంగా నిర్మాణ రంగ కార్మికుల అవసరం ఉంటే వారు తప్పక ఇక్కడకు వస్తారనడం అతిశయోక్తికాదు.

◆ చింతల్‌మెట్ అడ్డాలో కూలీలందరూ రెక్కాడితేగానీ డొక్కాడని పేదలే. ఏరోజుకారోజు తమను ఎవరు పనులను తీసుకెళ్తారా అని వేయికళ్లతో ఎదురు చూస్తుంటారు. పని దొరికితే ఆ కుటుంబానికి నాలుగు వేళ్లు నోట్లోకి వెళ్తాయి. లేదంటే ఆ ఇంట ఆకలి మంట తథ్యం . కుటుంబంలో ఎంత మంది ఉంటూ దాదాపు పెద్ద వారందరూ పనులకు వెళ్లారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో కొందరు చిన్నారులు సైతం పనులకు వెళ్లే దుర్భర పరిస్థితులూ ఇక్కడి కార్మిక కుటుంబాల్లో లేకపోలేదు.

◆ సులేమాన్‌నగర్ డివిజన్ పరిధిలోని ఒక ప్రాంతమే చింతల్‌మెట్. ఇక్కడి ప్రధాన కూడలినే చింతల్‌మెట్ చౌరస్తా అని అంటారు. ఈ చౌరస్తాలో నిత్యం ప్రయాణికుల రాకపోకలతోపాటు చిరు వ్యాపారుల తోపుడుబండ్లతో కిటకిటలాడుతూ ఉంటుంది. గడచిన పాతికేళ్లగా ఈ ప్రాంతం తనకంటూ ఓ ప్రత్యేకతను సంతరించుకుంది. అదే దినసరి కూలీ అడ్డాగా పేరొందింది. ఉదయం ఓ చేతిలో టిఫిన్ బాక్స్, మరో చేతిలో పలుగు, పార పట్టుకొని ప్రయాణం ఎక్కడికి అంటే చింతల్‌మెట్ అంటూ వారి దైనందిన చర్య సాగుతుంది. ఇలా రోజూ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడ ఉపాధి అవకాశాలను వెతుక్కుంటారు. చింతల్‌మెట్‌లోని బస్టాండ్ ప్రాంతం నిత్యం ఉదయం 7 గంటల నుంచే వందలాదిగా తరలి వచ్చే కూలీలతో కిటకిటలాడుతూ ఉంటుంది. సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి కాంట్రాక్టర్‌లు, గృహాలు నిర్మించే బిల్డర్‌లు చింతల్‌మెట్‌కు వచ్చి కూలీలను పనుల కోసం తీసుకెళ్తారు. దీంతో ఈ ప్రాంతం ఉదయం అత్యంత రద్దీగా ఉంటుంది. చింతల్‌మెట్ అడ్డాకు వస్తే తప్పకుండా ఏదో ఒక పని దొరుకుతుందని కూలీలు ధైర్యంగా చెబుతారు.

◆ చింతల్‌మెట్, వీరన్న కుంట తదితర ప్రాంతాలలో చాలా మంది చింతల్‌మెట్ అడ్డాకు వచ్చే కూలీలు నివసిస్తున్నారు. ఇక్కడి నుంచి ఆటోలు, ట్రాక్టర్‌లు, లారీలలో కూలీలను పనుల కోసం తరలిస్తుంటారు. కాంట్రాక్టర్లు కొందరూ కూలీలకు ఎప్పటికప్పుడు పనులను చూపిస్తారు. దీంతో ఈ ప్రాంతం కూలీల ప్రాంతంగా పేరుగాంచింది. కూలీలతోపాటు వారిని తరలించే ఆటోలు ఇతర వాహనాలకు కూడా గిరాకీ బాగానే ఉంటుంది. అయినా కూలీల తలరాతలు మాత్రం మారడం లేదు.

పాత మిలట్రీ క్వార్టర్స్‌లో జీఓ 118 అమలు చేయాలి

గోల్కొండ: పాత మిలట్రీ క్వార్టర్స్‌లో జీఓ 118 అమలు చేయాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన రక్షణ శాఖ ఎస్టేట్ ఆఫీసర్ దినేష్‌కుమార్‌రెడ్డిని కలిశారు. శిథిలావస్థకు చేరుకున్న మిలట్రీ క్వార్టర్స్‌కు చిన్న మరమ్మతులు సైతం చేయనివ్వకుండా మిలట్రీ వారు అడ్డుకుంటున్నారని ఆయన అన్నారు. ఎస్టేట్ అధికారులకు అనేక సార్లు వినతిపత్రాలు ఇచ్చి మిలట్రీ క్వార్టర్స్‌లో నివసించే వారి కన్నీటి గాదలు వినిపించామన్నారు. ఇప్పటికైనా జీఓ 118ను అమలు పరుస్తూ మిలట్రీ క్వార్టర్స్‌లో నివసించే అర్హులైన కుటుంబాలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ విషయంపై చర్చించి చర్యలు తీసుకుంటానని ఎస్టేట్ ఆఫీసర్ హామీ ఇచ్చారు.

శేరిలింగంపల్లి జెడ్‌సీగా హేమంత్

గచ్చిబౌలి: జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్‌గా హేమంత్ సహదేవ్‌రావు భోర్ఖాడే బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ జెడ్‌సీగా ఉన్న ఉపేందర్‌రెడ్డిని హెచ్ఎండీఏ సెక్రటరీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో హేమంత్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ వైద్య సేవల సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీజీఎంఎస్ఐడీసీ) ఎండీగా పని చేస్తున్న ఆయనను జీహెచ్ఎంసీ జెడ్‌సీగా బదిలీ చేసిన విషయం తెలిసిందే.

పార్కులు కళకళ

- వేసవి సెలవులు ప్రారంభంతో పార్కులు కిటకిట
- సందడి చేస్తున్న చిన్నారులు
- సేదతీరుతున్న మహిళలు, వృద్ధులు
- ఉభయ సంధ్య వేళల్లో సందర్శకుల రద్దీ



శాస్త్రిపురం: పచ్చదనంతో కూడిన పార్కులు వేసవిలో మండే ఎండలు, ఉక్కపోత నుంచి ప్రజలకు ఆహ్లాదాన్నిస్తాయనడం నిర్వివాదాంశం. పాఠశాలు, కళాశాలకు వేసవి సెలవులు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో చిన్నాపెద్ద అనే తేడా లేకుండా ఉభయ సంధ్య వేళల్లో పార్కుల్లో ఆడి పాడతూ సందడి చేస్తున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు పార్కుల్లో ఓపెన్ జిమ్‌లతో పాటు చిన్నారుల కోసం ఆట వస్తువులను ఏర్పాటు చేశారు. దీంతో ఆయా పార్కుల్లో చిన్నారులు కేరింతలు కొడుతూ ఆడుకోవడం కనిపిస్తోంది. శాస్త్రీపురం, సులేమాన్‌నగర్, అత్తాపూర్ తదితర ప్రాంతాల్లోని కొన్ని కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలలో చిన్నారులు హుషారుగా ఆడుకుంటున్నారు. మహిళలు, వృద్ధులు ఇళ్లల్లో ఉక్కపోతను భరించలేక పార్కులకు వచ్చి సేదతీరుతున్నారు. ఓపెన్ జిమ్‌లను సద్వినియోగం చేసుకుంటున్నారు. గడచిన వారం రోజులుగా పార్కులన్నీ సందర్శకులతో కళకళలాడుతున్నాయి.





పార్కుల్లో సందడి చేస్తున్న చిన్నారులు